నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శనివారం | ఫిబ్రవరి 24, 2024 | www.navatelangana.com

బ్రెయిన్ స్ట్రోక్‌తో గల్ఫ్‌లో యువకుడి మృతి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని దేవుడగూడ గ్రామానికి చెందిన కునారపు వెంకటేష్(24) ఇరాక్ ఇబ్రహీల్ పట్టణంలో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. 8 నెలల క్రితం పెళ్లి చేసుకున్నాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేక పొట్టకూటికోసం 6 నెలల క్రితం గల్ఫ్ బాట పట్టాడు. ఆరోగ్యంగా ఉన్న యువకుడు అప్పుల ఒత్తిడితో జనవరి 30న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. అక్కడ ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్లినా ఫలితం లేకుండా పోయింది. 24 రోజులు తర్వాత శుక్రవారం భౌతికకాయం స్వగ్రామానికి చేరుకుంది. భౌతికకాయం రావడానికి సహకరించిన కంపెనీ యాజమాన్యానికి, తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కల్లెడ భూమయ్యకు కుటుంబ సభ్యులు గోపాల్, గంగాధర్, కమలాకర్ ధన్యవాదాలు తెలిపారు.



రైస్ మిల్లు సీజ్

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలో రైస్ మిల్లులను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. వెంకట్రావుపేట్‌లోని శ్రీ సాయి బాలాజీ అగ్రోటెక్ రైస్ మిల్లును తనిఖీ చేయడానికి వెళ్లగా తాళం వేసి ఉంది. రైస్ మిల్ యజమానిని ఫోన్‌లో సంప్రదించగా కాలయాపన చేశాడు. దీంతో దానికి సీల్ వేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య తెలిపారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎఎస్ఓ వినోద్‌కుమార్, డీటీలు శ్రీనివాస్, శ్యామ్‌లాల్, రాజ్‌కుమార్, ఆర్ఐ ముబీన్ పాల్గొన్నారు.



అప్పులు చేసి..అభివృద్ధికి వెచ్చించి..!

- బిల్లులు రాక తాజా మాజీ సర్పంచ్‌ల అవస్థలు
- తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక సతమతం
- ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వైనం
- పదవీకాలం ముగిసిపోవడంతో ఆందోళన
- కొత్త సర్కారుపైనే కొండంత ఆశలు

ఐదేండ్ల పదవీకాలంలో గ్రామం గురించే ఆలోచించారు. సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయడంపైనే దృష్టి సారించారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసినా..విడుదల చేయకపోవడంతో చేపట్టిన పనులకు ఎలాగైనా బిల్లులు వస్తాయనే ఆశతో ఇతరుల వద్ద నుంచి అప్పులు తీసుకొచ్చి పనులు పూర్తిచేశారు. అంతలోనే పదవీ కాలం ముగిసిపోవడం..నెలలు గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో సర్పంచ్‌లు అరిగోస పడుతున్నారు. ప్రస్తుతం వారి పదవీకాలం ముగిసిపోవడంతో చేపట్టిన బిల్లుల పరిస్థితి ఏంటనే ఆందోళన వారిని వెంటాడుతోంది. గత ప్రభుత్వం ఏండ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో నిరసనలు చేపట్టిన సర్పంచ్‌లు ఎన్నికల ముగింట కొన్నింటిని విడుదల చేసింది. కానీ ఇంకా రూ.లక్షల్లో బిల్లులు పేరుకుపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకొని విలవిల్లాడుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వమైనా సకాలంలో బిల్లులు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.



ఈమె తలమడుగు మండలం కుచులాపూర్ గ్రామ తాజామాజీ సర్పంచ్ మొహితే ప్రభ. గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.20లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. వీటితో పాటు గ్రామంలో మన ఊరు-మనబడి కార్యక్రమం కింద పాఠశాల నిర్మాణానికి మరో రూ.6లక్షల వరకు పనులు చేపట్టారు. వీటితో పాటు చిన్నాచితక పనులు కూడా పూర్తిచేశారు. 3శాతం వడ్డీకి ఇతరుల వద్ద నుంచి అప్పులు తీసుకొచ్చి పనులు పూర్తిచేశారు. కానీ ఏడాది గడుస్తున్నా వాటికి సంబంధించి బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వడ్డీలు చెల్లించలేక సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితి ఉమ్మడి జిల్లాలో అనేక మంది మాజీ సర్పంచ్‌లు ఎదుర్కొంటున్నారు.



ఆయన పేరు భూసి భీమేష్. ఆసిఫాబాద్ మండలం ఈదులవాడ తాజా మాజీ సర్పంచ్. ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి మూడున్నర లక్షల నిధులు పెండింగ్‌లో ఉండగా పంచాయతీ నిధులతో చేపట్టిన పనులు మరో రూ.7.50లక్షలు రావాల్సి ఉంది. వీటితో పాటు చిన్నా చితక పనులకు సంబంధించి బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం రూ.17లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉందని చెబుతున్నారు. చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్పంచ్ అయితే గ్రామాన్ని అభివృద్ధి చేయవచ్చని భావించారు. ఎన్నికల సమరంలో నిలిచి ఊరి ప్రథమ పౌరులుగా ఎన్నికయ్యారు. గెలిచిన తర్వాత ఊరికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని భావించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరుచేసిన నిధులతో పనులు చేపట్టారు. ఒక్కో గ్రామానికి కేంద్ర ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక సంఘం నిధులతో ఉపాధిహామీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సైతం నిధులు భారీగా విడుదల చేస్తోంది. భారీగా నిధులు మంజూరవుతున్నాయనే సంబరంతో కొన్ని టెండర్ల ద్వారా మరికొన్ని సొంతంగా పనులు చేపట్టారు. అనేక మంది సర్పంచ్‌ల ఆర్థిక స్థితి బాగాలేకపోవడం.. కొందరు అతి పేద వారు కూడా ఉండటంతో ఇతరుల వద్ద నుంచి నెలవారీగా చెల్లించేలా వడ్డీలకు డబ్బులు అప్పులు తీసుకొచ్చారు. ఒక్కొక్కరు 3 నుంచి 5శాతం చొప్పున అప్పులు తీసుకొచ్చి ఆయా పనులు చేపట్టారు. ఉపాధిహామీ నిధులతో డంపింగ్‌యార్డులు, స్మశానవాటికలు, వైకుంఠదామాలు తదితర వాటిని నిర్మించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచే నిధులతో సీసీ రోడ్లు, మురుగుకాల్వలు తదితర పనులు పూర్తిచేశారు.

రూ.కోట్లలో పెండింగ్ బిల్లులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1509 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో సుమారు 1500 పంచాయతీలకు సర్పంచ్‌లున్నారు. కొన్ని గ్రామాలకు వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. ఐదేండ్ల పాటు సర్పంచ్‌లుగా కొనసాగిన వీరి పదవీకాలం ఈ నెల 1వతేదీతో ముగిసిపోయింది. దీంతో ఇది వరకే చేపట్టిన బిల్లుల మంజూరుపై సందిగ్ధం నెలకొంది. ఒక్కో సర్పంచ్ సుమారు రూ.10లక్షల నుంచి రూ.30లక్షల వరకు పనులు చేపట్టిన బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాదికాలంగా వీటి కోసం నిరీక్షిస్తున్నా ప్రభుత్వం వీరిని గోసను పట్టించుకోలేదు. అంతలోనే ప్రభుత్వం మారిపోవడం.. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు కొలువుదీరడంతో సర్పంచ్‌లు ఆందోళనకు గురవుతున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక..ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు సర్పంచ్‌లు ఆత్మహత్యలకు ఒడిగట్టిన సందర్భాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు రూ.కోట్లలో పేరుకుపోవడంతో ఆ బిల్లులు వస్తాయా రావా అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు సర్పంచ్‌లు హైదరాబాదు వెళ్లి నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ప్రభుత్వం హామీనిచ్చిందని ప్రస్తుతం బిల్లులు విడుదల చేసి మాట నిలబెట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.



పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి : నిహారిక, మాజీ సర్పంచ్, నాగపెల్లి, కౌటాల మండలం

ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరుచేసింది. సొంత డబ్బులతో పాటు ఇతరుల వద్ద నుంచి అప్పులు తీసుకొచ్చి పనులు పూర్తిచేశాం. కానీ ఏడాది గడుస్తున్నా వీటికి సంబంధించి బిల్లులు విడుదల కావడం లేదు. ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొత్త ప్రభుత్వం మాజీ సర్పంచ్‌ల సమస్యపై దృష్టిసారించి త్వరితగతిన పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం పదేండ్లుగా రైతులకు తీరని అన్యాయం చేస్తోందని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న అన్నారు. కేంద్ర బీజేపీ, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు యువ రైతు శుభకరన్ సింగ్‌ను పంజాబ్ బార్డర్‌లో క్రూరంగా హత్య చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం పార్టీ కార్యాలయం ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బొజ్జ ఆశన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బ్లాక్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశామన్నారు. గతంలో ఢిల్లీలో రైతులు సమ్మె చేసి తమ హక్కులు సాధించుకున్నారని, ఈ క్రమంలో ఎందరో రైతులు తమ ప్రాణాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం మొండిగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండించారు. బడా పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న బిజెపి ప్రభుత్వం తక్షణమే రైతుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోకపోతే దేశమంతటా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఆర్ మంజుల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, సహాయ కార్యదర్శి ఎస్.స్వామి, కే.ఆశన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు పొచ్చక్క, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అగ్గిమల్ల స్వామి, ఎస్వీఆర్డీ జిల్లా కార్యదర్శి ఆరిఫా పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి



నవతెలంగాణ-జైనూర్

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని పాట్నాపూర్ బాలికల గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. 9, 10 తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. భోజన విషయంలో అశ్రద్ధ చూపుతున్నారని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పాఠశాల పరిసరాలను, వంట సరుకులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని, లేకపోతే చర్యలు తప్పవని పాఠశాల సిబ్బందిని హెచ్చరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా జీసీడీవో శకుంతల, ఆదిలాబాద్ జీసీడీవో మెస్రం ఛాయ, ఉపాధ్యాయులు భీంరావు, సునీత, కళాబాయి పాల్గొన్నారు.

గొల్లఘట్ గ్రామ సమస్యలపై కలెక్టర్ ఆరా



నవతెలంగాణ-తాంసి

గ్రామ సమస్యలను పరిష్కరించలేకపోతున్నారని గత అసెంబ్లీ ఎన్నికలను గొల్లఘట్ గ్రామ ప్రజలు బహిష్కరించిన విషయం తెలిసిందే. ఎన్నికల బహిష్కరణకు కారణాలను అధికారులతో తెలుసుకొని శుక్రవారం కలెక్టర్ రాహుల్ రాజ్ ఆ గ్రామాన్ని సందర్శించారు. గ్రామ సమస్యలపై యువకులు, గ్రామ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. రోడ్డు, తాగునీటి సమస్యలతో పాటు వివిధ సమస్యలను గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సమస్యలను ప్రభుత్వానికి నివేదించి పరిష్కారానికి భరోసా కల్పించారు. అతి త్వరలో తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీఏజీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

టీఏజీఎస్ (తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం) నూతన క్యాలెండర్‌ను శుక్రవారం ఎస్సై దుబ్బాక సునీల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాలెండర్ ద్వారా ఆదివాసుల సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగలను ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో ప్రచురించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, విద్యార్థి సంఘం మండల కార్యదర్శి కాత్లే పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీలో వరుస విషాదాలు

- తాజాగా మరో విద్యార్థిని ఆత్మహత్య



ట్రిపుల్ ఐటీ ప్రాంగణం, ఇన్‌సెట్‌లో ఆత్మహత్య చేసుకున్న శిరీష(ఫైల్)

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ రాష్ట్రంలో ఏకైక సాంకేతిక విద్యా సంస్థ(ట్రిపుల్ ఐటీ) బాసరలో ఉంది. గ్రామీణ ప్రాంతాల వారికి సాంకేతిక విద్య అందించటానికి స్థాపించిన కళాశాలలో పలువురు విద్యార్థులు వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఆత్మహత్యలు వరుసగా కొనసాగుతున్నప్పటికీ యూనివర్సిటీ యాజమాన్యం పట్టించుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం రాత్రి పియుసి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తెనుగు శిరీష(17) ఉరేసుకుంది. విద్యార్థిని రాసిన సూసైడ్ నోట్ ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టిస్తోంది. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దవ్వూరుకు చెందిన శిరీష బావ మృతిని తట్టుకోలేక చనిపోతున్నట్టు లేఖలో రాసింది. తాను ప్రాణంగా ప్రేమించిన బావ ఆకాశ్ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడని, ఆయన లేకుండా బతకలేనని పేర్కొంది. 'నన్ను క్షమించండి మీరు బాధపడతారని తెలుసు. కానీ బావ లేని జీవితం నాకెప్పటికీ శూన్యమే. అందుకే నేను తన దగ్గరికి వెళ్లిపోతున్నా' అంటూ తెలిపింది. బావ చావుకు కారణమైన వారిని వదలొద్దని, తన చివరి కోరిక కూడా తీర్చాలని, బావని దహనం చేసిన చోటే కాల్చండని పేర్కొంది. విద్యార్థిని మృతని కళాశాలలోనే కాకుండా బంధువులు, స్నేహితులు జీర్ణించుకోలేకపోతున్నారు. కంటికి రెప్పలా కాపాడాల్సిన కళాశాల యాజమాన్యం ఏం చేస్తుందని కుటుంబం సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి కుటుంబ సభ్యులు విలపించిన తీరు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

పకడ్బందీ చర్యలు తీసుకోని యాజమాన్యం

బాసర ట్రిపుల్ ఐటీలో తరచూ ఆత్మహత్య ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. అయినా యూనివర్సిటీ అధికారులు వీటిపై దృష్టిపెట్టకపోవడం పట్ల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. విద్యార్థుల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన యూనివర్సిటీ యాజమాన్యం పట్టించుకోకపోవటంతోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనేక సంఘటనలు చోటు చేసుకున్నప్పటికీ ప్రభుత్వంగానీ, కళాశాల యజమాన్యంగానీ పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కన్పించడం లేదు. నామమాత్రపు చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి విద్యార్థుల మానసిక స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆత్మహత్యల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

- ఆదివాసీ గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తేయాలి
- తమ్మినేని వీరభద్రంకు మంచిర్యాల జిల్లా కమిటీ వినతి



నవతెలంగాణ - హాజీపూర్

పోడు భూములకు పట్టలివ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని దండేపల్లి మండలం మాకులపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కోయపోచగూడెంలో ఆదివాసీ, నాయకపోడ్‌కు చెందిన నలభై కుటుంబలున్నాయన్నారు. 2003 నుండి లింగాపూర్ శివారు సర్వే నెం 25,26లో గల ప్రభుత్వ ఫారెస్ట్ భూమి 200 ఎకరాల్లో పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఫారెస్ట్ శాఖ, గత ప్రభుత్వం ఆదివాసులు సాగులో ఉన్న భూమి నుండి వెళ్లగొట్టాలని 2003 నుండి 2023 వరకు 160 కేసులు పెట్టారన్నారు. ఒక పీడీ యాక్ట్ కేసు కూడా బనాయించారని తెలిపారు. పోడు భూముల కోసం ఆందోళన చేస్తే కోయపోచగూడెం ఆదివాసీ గిరిజన మహిళలపై, చంటి పిల్లల తల్లులపై, బాలింతలు అని చూడకుండా అక్రమ కేసులు పెట్టి వారం రోజులు పాటు జైల్లో పెట్టారని గుర్తు చేశారు. నేటికీ వారికి హక్కు పత్రాలు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఈ సమస్య పరిష్కారమయ్యే విధంగా చూడాలని కోరారుర. వినతిపత్రం అందజేసిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య , జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు ప్రకాష్, అశోక్, చందు, దుంపల రంజిత్ కుమార్, కోయపోచగూడెం ఆదివాసీ గిరిజన నాయకులు ఉన్నారు.

టీజీబీ ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-కౌటాల

తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం సమ్మెలో పాల్గొన్నారు. దీంతో బ్యాంకు తెరుచుకోలేదు. ఖాతాదారులకు ముందస్తు సమాచారం లేకపోవడంతో అసౌకర్యానికి గురయ్యారు. ఏళ్ల నుండి బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా నిర్లక్ష్యం చేయడంతో సమ్మె తలపెట్టారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి బ్యాంకు సేవలకు ఆటంకం కల్గకుండా చూడాలని ఖాతాదారులు కోరుతున్నారు.

అమరుడు ప్రవీణ్‌కుమార్ : గజానంద్ నాయక్



నవతెలంగాణ-నార్నూర్

అతిపిన్న వయసులో పోలీసు శాఖల్లో ఉద్యోగం సాధించి గ్రేహౌండ్ కమాండోగా విధులు నిర్వర్తిస్తూ విద్యుద్ఘాతంతో మృతి చెందిన ప్రవీణ్‌కుమార్ అమరుడని మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజులగూడ గ్రామంలో పెద్దకర్మ (తెరివి) కార్యక్రమంలో ప్రవీణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్‌కుమార్ నేటి యువతకు ఆదర్శ ప్రాయుడన్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌చార్జి ఛైర్మన్ సురేష్ ఆడే, వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావ్, గ్రేహౌండ్స్ డీఎస్పీ శంకరయ్య, సీఐ రహీం పాషా, సీనియర్ నాయకులు యూనిస్ అక్బాని, మాజీ సర్పంచ్ సావిందర్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, శ్రీరాంనాయక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | ఫిబ్రవరి 24, 2024 | www.navatelangana.com

నాన్ ట్రైబల్ సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-నార్నూర్



ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న నాన్ ట్రైబల్ ఎస్సీ, బీసీ, మైనారిటీల సమస్యలను పరిష్కరించాలని నాన్ ట్రైబల్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు ఉట్నూర్‌లో వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో పీపీ ల్యాండ్ ఉన్న భూములకు బ్యాంక్ ద్వారా క్రాప్ లోన్ మంజూరు చేసేవిధంగా కృషి చేయాలని విన్నవించారు. ముందుగా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాన్ ట్రైబల్ నాయకులు కేంద్రే సురేష్, ఇరాలే విఠల్, జాదవ్ లాలూ ఉన్నారు.

ఏజెన్సీలో బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ఐటీడీఏ పరిధిలో ఉన్న ఏజెన్సీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలనీ, డీఎస్సీ కమిటీ సభ్యులు దీపక్, సుమేష్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లి, ఏజెన్సీ డీఎస్సీని ప్రకటించే విధంగా చొరవ తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ కమిటీ సభ్యులు కిషోర్, విజేష్ ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేత



నవతెలంగాణ-లక్ష్మణచాంద

జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వడ్యాల్ పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా పదో తరగతి స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ స్టడీ మెటీరియల్‌కు కావాల్సిన ఆర్థిక మొత్తాన్ని వడ్యాల్ గ్రామానికి చెందిన రిటైర్డ్ జనరల్ మేనేజర్ అట్ల లింగారెడ్డి, దాదాపు రూ.16వేల 500 ఖర్చుతో మెటీరియల్‌ని విద్యార్థిని, విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, గంగాధర్, లయన్స్ క్లబ్ సభ్యులు చంద్రమోహన్‌రెడ్డి, ఎల్.రాజేశ్వర్‌రెడ్డి, సాయి, బాపురెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ట్రాన్స్ కో ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రోజుల్లో మెరుగైన విద్యుత్ సరఫరా అందించడంలో భాగంగా విద్యుత్ వైర్లు, స్తంభాలు మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

డీఎస్పీని కలిసిన మున్సిపల్ మాజీ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన, జీవన్‌రెడ్డిని మున్సిపల్ చైర్మెన్ దిగంబర్‌రావు పాటిల్, దుర్గం ట్రస్ట్ చైర్మెన్ దుర్గం శేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డీఎస్పీకి గతంలో జిల్లాలో పని చేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో ఆనాటి రోజులను గుర్తు చేసుకున్నారు. డీఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మహేందర్, మోహన్, రగునాథ్ ఆడే, గేడం సాగర్, సూరజ్ సోన్‌కాంబ్లె పాల్గొన్నారు.

26న తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక వేలం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మునిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 25 ట్రాక్టర్ల ఇసుకను జప్తు చేయడం జరుగుతుందని, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఫిబ్రవరి 26న స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వేలం పాట నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ జానకి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో ట్రాక్టర్ లోడ్ ప్రారంభ ధర రూ.18వందలు నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తిగలవారు వేలంలో పాల్గొనాల్సిందిగా సూచించారు.

రేపు రెండో లెవెల్ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలల రెండో లెవెల్ ఎంపిక పరీక్ష ఈనెల 25న ఆదివారం నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయకర్త, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్ష కొరకు జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రెండో స్థాయికి ఎంపికైన విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావాలని సూచించారు.

నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

నవతెలంగాణ-పెంబి

మండలంలోని కొస్యగుట్ట గ్రామపంచాయతీలో శుక్రవారం హైటెక్ సొసైటీ, ఫారెస్ట్ రేంజ్ అధికారి రామకృష్ణ ఆధ్వరంలో మహిళలకు ఉపాధి కల్పనకు శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్ఓ ప్రతాప్ మాట్లాడుతూ గిరిజన మహిళలకు కుట్టు మిషన్లు, అందించి వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్, రమేష్, సెక్యూరిటీ సంతోష్, రాజేశ్వర్, రాజన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పీఆర్టీయూ తెలంగాణ టీచర్స్ యూనియన్ క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రణీత ఆధ్వర్యంలో శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి పాటుపడాలని, నూతనంగా ఏర్పాటైన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఆడే నూర్‌సింగ్, నర్రా నవీన్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్ కుమార్, రూపావత్ దినేష్, సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



పార్లమెంట్ ఎన్నికల్లో

బీజేపీ ఓటమి లక్ష్యంగా పనిచేస్తాం

- సీపీఐ(ఎం) జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరుగుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో జిల్లాలో చేస్తున్న కృషి భవిష్యత్ కర్తవ్యాలపై జిల్లా రిపోర్ట్ ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించినా, ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి బీజేపీ చేసింది శూన్యమని అన్నారు. జిల్లా అభివృద్ధికి దోహదపడే సీసీఐ తెరిపిస్తామని, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్, జిల్లా కేంద్రంలో ఏరో డ్రమ్, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని హామీలిచ్చి 10 సంవత్సరాల నుంచి హామీలను విస్మరిస్తూ ఆదిలాబాద్ జిల్లా ప్రజలను మోసాగిస్తున్నారని అన్నారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో మత విభజన తీసుకువస్తూ, ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న బీజేపీ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ ఓటమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేస్తామని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పక్షాలతో ఏర్పడిన జిల్లా సమగ్రాభివృద్ధి సాధన కమిటీ ఆధ్వర్యంలో సమర శీల పోరాటాలను రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, సీనియర్ నాయకులు బండి దత్తాత్రి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది

- ఎమ్మెల్యేకు జోగు రామన్న నివాళి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో తనువు చాలించడంతో పార్టీ శ్రేణులు ఘన నివాళులర్పించారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో లాస్య నందిత చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. పిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్య నందిత మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. లాస్యనందిత తండ్రి సాయన్నతో తనకు సత్సంబంధాలు ఉండేవని అన్నారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరుతూ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బండారి సతీష్, సంద నర్సింగ్, అశోక్ స్వామి, భరత్, నాయకులు విజ్జగిరి నారాయణ, రోకండ్ల రమేష్, మహిళా అధ్యక్షులు స్వరూప రాణి, కరుణ, ధమ్మపాల్, శ్రీనివాస్, రాంకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్యనందిత మరణం తీరని లోటు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత మరణం తీరని లోటని జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కార్పొరేటర్ స్థాయి నుంచి అంచేలంచెలుగా ఎదిగి నేటి యువతకు ఆదర్శంగా నిలిచిందని అన్నారు. దురదృష్టశవత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో శుక్రవారం జెడ్పీటీసీ నివాళులర్పించారు.

సేవాలాల్ జయంతి పోస్టర్ విడుదల



నవతెలంగాణ-ఉట్నూర్

ఈ నెల 26న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు గుగ్లోత్ రవి నాయక్, కమిటీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డిగ్రీ పాసైన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థుల నుంచి ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి మార్చ్ 6 వరకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌స్టడీసర్కిల్అండ్‌సర్కిల్.కో.ఇన్ ఆన్ లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, ఈ శిక్షణ 5 నెలల పాటు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో రూ.2500, పుస్తకాలు అందజేస్తామని, ప్రతీ నెల కాస్మోటిక్ చార్జీలు ఇస్తామన్నారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కొరకు 9494149416, 9398784343 నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా 148వ జయంతి

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలో శుక్రవారం సంత్ గాడ్గే బాబా 148వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గాడ్గే బాబా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ డాక్టర్ గణేష్ మోతేవాడ్ మాట్లాడుతూ గాడ్గే బాబా సమాజంలో కులం పోవాలని, తన పాటల ద్వారా పరిచయం చేశారని, మూఢనమ్మకాలుపోవాలని గుడులను రోడ్లను, చీపురు పెట్టి శుభ్రం చేసేవారని పేర్కొన్నారు. నేటి సమాజంలో ప్రతిఒక్కరూ ఆయన చెప్పిన బాటలో నడవాలని కోరారు. కార్యక్రమంలో కాంబ్లే దయానంద్, జనార్ధన్ గుట్టే, రాథోడ్ మహేష్ ఉన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ ఆధ్వర్యంలో ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశాలపై రెండు రోజుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఐటీ హబ్ రీజినల్ సెంటర్ మేనేజర్ బి.రఘుతేజ, టాస్క్ కళాశాల ఇన్‌చార్జి డాక్టర్ బి.జ్యోత్స్నరాణి హజరయ్యారు. ఈ సందర్భంగా విశ్లేషణ, లాజికల్, డెసిషన్ మేకింగ్, సమస్యల పరిష్కారం, అలాగే టైం మేనేజ్మెంట్ వంటి నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.భరద్వాజ, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లు లేక ఇబ్బందులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ ఆస్పత్రిలో అత్యవసర సమయంలో ఐటీడీఏ అంబులెన్స్‌లు లేక ఆదివాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రుపేష్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి రిమ్స్‌లో అనారోగ్యంతో ఉన్న జైనథ్ మండలంలోని పార్డి(కె) గ్రామానికి చెందిన మెస్రం సుమన్‌బాయి గుండె నొప్పి వచ్చిందన్నారు. స్థానిక వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం అవసరమని సూచించారు. ఈ క్రమంలో అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలించేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకొని ఆ మహిళకు రిమ్స్ డైరెక్టర్‌తో మాట్లాడి అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఐటీడీఏ అంబులెన్స్‌లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

నూతన తహసీల్దార్‌ను సన్మానించిన రేషన్ డీలర్లు



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ డి.స్వాతిని మండల రేషన్ డీలర్లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. సానుకూలంగా స్పందించిన ఆమె సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో విధులు నిర్వహించే ఆమె దిలావర్‌పూర్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు సుభాష్, కుంట సాగర్, చిన్నయ్య, రాజేశ్వర్, నర్సయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని మాదిగ జేఏసీ కమిటీ నాయకులు అన్నారు. ఈ విషయమై శుక్రవారం డీఎస్పీని కలిసి విన్నవించారు. అంతకుముందు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ జీవన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా కమిటీ నాయకులు మల్యాల మనోజ్, నక్క రాందాస్, నాతరి సరోజ, లింగంపల్లి ప్రసన్నకుమార్, తారా రవికుమార్, కత్తి గంగాధర్, బట్టు మహేందర్, చొప్పదండి భూమన్న, అద్దంకి శ్రీనివాస్ ఉన్నారు.

స్వామినాథన్ కమిషన్ సూచనలు అమలు చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులు పండించిన పంటలకు, గిట్టుబాటు ధర కల్పిస్తూ, గిట్టుబాటు ధరలకు చట్ట బద్దత కల్పించాలని, స్వామి నాథన్ కమీషన్ సూచనలు అమలు చేయాలని, రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై, పైశాచిక దాడులు చేస్తూ పంజాబ్, హర్యానా పోలీసులు కాల్పులు జరిపి, 24ఏండ్ల, యువ రైతును, పొట్టన పెట్టుకున్న, బీజేపీ ప్రభుత్వం, ఫాసిస్ట్ విధానాన్ని రైతు స్వరాజ్యవేదిక, తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు.బీజేపీ ప్రభుత్వం, ఆరెస్సెస్ అండతో రైతులపై, విచక్షణా రహితంగా దాడులు చేసి ఆరెస్సెస్, మెప్పు పొందడానికి, మాత్రమే పని చేస్తుందే తప్ప, ఈ ప్రభుత్వం, ప్రజల ప్రభుత్వం కాదని తేలి పోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా, రైతులు చేస్తున్న ఉద్యమం న్యాయమైనదని భావిస్తూ, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, కల్పించేందుకు, స్వామి నాథన్ కమీషన్ సూచనలు అమలు చేయాలని, వాటికి చట్ట బద్దత కల్పించాలని, పోలీసులు జరిపిన కాల్పుల్లో మరణించిన రైతు కుటుంబానికి, నష్ట పరిహారంచెల్లించి, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన ఎర్రం విఠల్ సతీమణి ఇటీవల అకాల మరణం చెందింది. శుక్రవారం విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

వనదేవతలకు భక్తుల మొక్కులు

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ఎడ్‌బిడ్ తండాలోని గుట్టలో వెలిసిన శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర మూడో రోజైన శుక్రవారం వనదేవతలకు భక్తులు మొక్కులు చెల్లించేందుకు తరలివచ్చారు. భాజ భజంత్రీల మధ్య బోనాలు ఒడి బియ్యం తీసుకువచ్చి, శ్రీ సమ్మక్క సారాలమ్మ దేవతలకు సమర్పించారు. మొక్కిన మొక్కులు నెరవేయారాలని భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి నిలువెత్తు బెల్లం వనదేవతలకు సమర్పించారు.



నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
శనివారం | ఫిబ్రవరి 24, 2024 | www.navatelangana.com

రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ - కాగజ్‌నగర్‌రూరల్

వంజీరి గ్రామానికి చెందిన లెండుగురె కృష్ణ(38) గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్‌పై శుక్రవారం ఉదయం గూడ్స్ రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. మృతుడు మద్యానికి బానిసై మానసిక స్థితి సరిగా లేక మంచిర్యాల నుండి బల్లర్షా వైపు వెళ్లే గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్టు పేర్కొన్నాడు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివాము దగ్ధం



నవతెలంగాణ-కడెం

మండలంలోని నవాబ్‌పేట్ గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రాపెల్లి సతీష్ గడ్డివాముకు విద్యుత్ స్తంభానికి ఉన్న బల్బు షార్ట్ సర్క్యూట్‌తో పగిలి కింద పడడంతో నిప్పంటుకుంది. దీంతో 90 గడ్డి కట్టలు, సెంట్రింగ్ కట్టెలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరాడు.

పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట శ్రీనివాస్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశంలో జిల్లా కార్యకలాపాల రిపోర్ట్, భవిష్యత్ కర్తవ్యాలపై ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే పూర్తి చెయ్యాలని, ఆడ ప్రాజెక్ట్‌కి మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడేటి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పారని దాని పనులు వెంటనే మొదలు పెట్టాలని కోరారు. తునికాకు బోనస్ పెండింగ్ ఉందని వెంటనే చెల్లించాలని, గత ప్రభుత్వం హడావిడిగా మెడికల్ కాలేజీ ప్రారంభించిందని టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ భర్తీ చెయ్యలేదని, అనుబంధ ఆస్పత్రిలో డాక్టర్ పోస్టులు, టెక్నికల్, నాన్ టెక్నికల్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మారుమూల ఆదివాసీ గ్రామాలకు రోడ్ల విషయంలో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అనుమతులు ఇవ్వకపోవడం సరికాదని, మిగిలినా పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలని లేని పక్షంలో ప్రజలు పోరాటాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ విస్తృత సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కుశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ పాల్గొన్నారు.

స్వేరోస్ మండల కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-బెజ్జూర్

మండలం కేంద్రంలో శుక్రవారం స్వేరోస్ జాతీయ అధ్యక్షుడు సుప్రీం స్వెరోస్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు డి.సురేష్ అధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నిక ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దుర్గం దేవాజీ, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు డి.సురేష్ మాట్లాడుతూ స్వేరోస్ సంస్థ అనేది రాజకీయ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా పని చేస్తుందని అన్నారు. విద్య, ఆర్యోగ్య, ఆర్థిక అంశాల మీద ఈ సంస్థ పని చేస్తూ విద్యార్థిలకు, ప్రజలకు స్వేరోస్ నాయకులు నిత్యం అందుబాటులో ఉంటూ పని చేస్తున్నారన్నారు. స్వేరో సంస్థ టెన్ కామన్స్‌తో పని చేస్తుందనారు. స్వేరోయిజంపై అవగాహన కల్పించారు. అనంతరం జనగాం ఫకీర్ కూతురు వికలాంగురాలు కావడంతో ఎన్నారై జాడి చంద్రశేఖర్ సమక్షంలో 25 కిలోల బియ్యం, పప్పు, నూనె వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ మండల అధ్యక్షుడు దుర్గం దేవాజి, నాయకులు శ్రీకాంత్, జాడి తిరుపతి, కిషోర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మక్క జాతర

- దర్శించుకున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ పెద్దవాగు పంపు హౌజ్ సమీపంలో నిర్వహిస్తున్న సమ్మక్క, సారలమ్మ జాతరకు వైభవోపేతంగా కొనసాగుతోంది. జాతరకు పట్టణ, మండలం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతరలో దుకాణాల కోసం ప్రత్యేక స్థలాన్ని కేటాయించారు. రద్దీ పెరిగే అవకాశం ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. బుధవారం సారలమ్మ, గోవింద రాజు, పగిడిందరాజు, జంపన్నలను వనం నుంచి తీసుకురాగా, గురువారం రాత్రి సమ్మక్కను వనం నుంచి గద్దెలపైకి తీసుకువచ్చారు. అమ్మవార్లు గద్దెలపై కొలువై ఉండడంతో శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు శుక్రవారం అమ్మవార్లను దర్శించుకున్నారు. జాతర సందర్భంగా అమ్మవార్లను గద్దెలపైకి తీసుకువచ్చే క్రమంలో రాత్రి గద్దెల ప్రాంగణంలో భక్తుల పట్ల కమిటీ సభ్యుల ప్రవర్తన విమర్శలకు దారితీసింది. కమిటీ సభ్యుల కుటుంబీకులను మాత్రమే గద్దెల వద్దకు అనుమతించడంతో సామాన్యభక్తజనం కమిటీ తీరుపై మండిపడ్డారు. దీంతో పోలీసులు కలుగజేసుకుని భక్తులను సముదాయించారు. గద్దెల వద్ద జరిగే క్రతువుల్లో సరైన పద్ధతి పాటించాలని భక్తులు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మనోహర్‌ను శుక్రవారం కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం, కౌన్సిలర్లు కావలి సంతోష్, కిషోర్ నాయక్, కురుమ శ్రీనివాస్, నాయకులు జన్నారపు శంకర్, నాయని సంతోష్, షబ్బీర్ పాషా ఉన్నారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల అందిస్తున్న రుణాలతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, ఏపీడీ అర్క చరణ్ దాస్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ కోవ హనుమంతరావులతో కలిసి స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్థితిగతులు, పురోగతిపై జిల్లాలోని ఏపీఎంలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి స్వయం సహాయక సంఘం అభివృద్ధిపై క్షేత్రస్థాయిలో సమీక్షలు చేపట్టి సంబంధిత సంఘాల మహిళలతో ముఖాముఖి సమావేశం నిర్వహించాలని సూచించారు. ఆయా సంఘాలలో నెలకొన్న సమస్యలను గుర్తించాలని తెలిపారు. ప్రతి సంఘం ఖాతాతో బ్యాంకు లింకేజీ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని, ఆయా సంఘాలు గతంలో పొందిన రుణాలను తిరిగి చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు అర్హత కలిగిన సంఘాలను గుర్తించి రుణాలు మంజూరు చేసి వారిని ప్రోత్సహించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకు అధికారులు, ఏపీఎంలు, సీసీలు సమన్వయంతో పని చేయాలని, స్త్రీ నిధి రుణాల రికవరీ ప్రక్రియ ఈ ఆర్థిక సంవత్సరం ముగింపులోగా పూర్తి చేయాల ఆదేశించారు. రుణాల రికవరీ, బ్యాంకు లింకేజీలలో వెనుకబడి ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు రామకృష్ణ, అన్నాజీ, యశోద, యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థిని మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వాంకిడికి చెందిన షేక్ అంజుమ్ మృతికి ఆ పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని వారిపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోడిసెల కార్తీక్‌తో కలిసి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబాపూర్‌లో గల మైనార్టీ గురుకులంలో షేక్ అంజుమ్ మృతి చెందడం దారుణమన్నారు. విద్యార్థిని మృతికి అక్కడ పనిచేస్తున్న ఏఎన్ఎం తోపాటు ప్రిన్సిపల్ ఆమె ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించకపోవడమే కారణమన్నారు. జిల్లాలోని అన్ని గురుకులాల్లో ఇదే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మరణాలు గురుకులల్లో సర్వసాధారణంగా మారాయని అన్నారు. సంఘటన జరిగినప్పుడు మాత్రమే అధికారులు స్పందించి తర్వాత సాధారణ స్థితికి గురుకులాలు చేరుకుంటున్నాయని తెలిపారు. వెంటనే విద్యార్థిని మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని లేదంటే అన్ని విద్యార్థి సంఘాలు యువజన సంఘాలతో కలిపి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు ఏబివైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి కూడా ఇదే విషయంపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పూలే దంపతుల విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కోటపల్లి మండలం బోరపల్లి గ్రామంలో మహాత్మ జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలని మాలి సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు నాగోసే శంకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రేగుంట కేశవరావు డిమాండ్ చేశారు. విగ్రహాల ధ్వంసం నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనువాదుల కాలంలో దళిత బహుజనులకు చదువుకునే హక్కు కల్పించిన గొప్ప వ్యక్తులు పూలే దంపతులని కొనియాడారు. అటువంటి వారి విగ్రహాలు ధ్వంసం చేయడం బడుగు బలహీన వర్గాల మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు. విగ్రహాల ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దుర్గం తిరుపతి, గుర్నులే మెంగాజీ, వైరగడే మారుతి, కావుడే తులసిరామ్, సండే నారాయణ, మొహర్లే విశ్వనాథ్, డాక్టర్ మనోహర్, గోన్నాజి మొండయ్య గుర్నులే రుక్మాజి, నాగశే పుంజు, అదే మారుతి పాల్గొన్నారు.

మరోమారు మోడీని గెలిపించాలి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో దేశ భవిష్యత్తుకు మరో మారు మోడీని దేశప్రధానిగా గెలిపించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ విజయ సంకల్పయాత్రలో భాగంగా పట్టణంలోని రాజీవ్ చౌక్‌లో శుక్రవారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ మోడీ నేతృత్వంలో బీజేపీ పాలనలో దేశం సురక్షితంగా ఉంటుందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో చేయని స్కాం లేదని, అన్ని వ్యవస్థల్ని కేసీఆర్ భ్రష్టుపట్టించారన్నారు. బీఆర్ఎస్‌కు కాలం చెల్లిందని, ఒక్క ఎంపీ సీటు కూడా రాదన్నారు. గ్యారంటిలేని పార్టీ కాంగ్రెస్ అని, కర్నాటకలో హామీల అమలు జరగడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్యారంటీల అమలుకు గ్యారంటీ లేదన్నారు. ఉద్యమకారులను కాల్చి చంపిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధు ఎప్పుడిస్తారో చెప్పాలన్నారు. ఉచిత బస్సుతో ఉపయోగం లేదని, బెల్ట్ షాపులు ఎప్పుడు ఎత్తివేస్తారో చెప్పాలన్నారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి రాబోతోందని, ఈ సారి నాలుగు వందలకుపైగా సీట్లు సాధిస్తామని పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమవుతుందని తెలిపారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు అష్ట దిక్పాలకులుగా పని చేస్తామని, ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగడతామని తెలిపారు. ప్రతిపక్షంగా బాధ్యతలు నిర్వర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సోయం బాబురావు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, బీజేపీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రభారీ రాజమౌళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్ర చారి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోనీ శ్రీశైలం, ఆత్మారాం నాయక్, జాదవ్ రాజేష్‌బాబు, అభినవ సర్దార్, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుంకిడి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని సుంకిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు వివిధ రకాల వంటకాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులు తయారు చేసిన వంటకాలను గ్రామస్తులు, నాయకులు, ఉపాధ్యాయులు రుచులను చూసి విద్యార్థులు తయారు చేసిన వంటకాలను మెచ్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కన్వీనర్ రాజేశ్వర్, ఎంఈఓ నారాయణ, ఎంపీటీసీ గౌరమ్మ వెంకన్న యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు గణేష్, సుభాష్, లింగన్న, విలాస్ యాదవ్, నడిపెన్న, ఉపాధ్యాయులు గ్రామస్తులు పాల్గొన్నారు.



అరకొర బస్సులతో ప్రయాణికుల అవస్థలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మేడారం జాతర నేపథ్యంలో డిపో నుంచి సగానికి పైగా బస్సులు జాతర ప్రత్యేక బస్సులుగా నడుపుతుండడంతో గత మూడు రోజుల నుంచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది రోజువారీగా జిల్లా కేంద్రానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు నాలుగు గంటల వరకు ప్రయాణ ప్రాంగణానికి చేరుకున్నప్పటికీ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో కూడా ప్రయాణ ప్రాంగణం రద్దీతో కిక్కిరిసిపోయింది. ఐదు గంటలకు వచ్చిన వారు కూడా బస్సులు లేకపోవడంతో ప్రయివేటు వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆర్టీసీ అధికారులు కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బస్సులు నడుపుతున్నట్టు తెలిసింది. ఏది ఏమైనా మేడారం జాతర రోజువారి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తాయి.

జగ్జీవన్‌రాం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్‌రాం భవన నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించడం తోపాటు భవనానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రేగుంట కేశవరావు కోరారు. శుక్రవారం కలెక్టర్ బొర్కాడే హేమంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి జగ్జీవన్‌రాం భవన నిర్మాణ కోసం వినతి పత్రాలు అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే జయంతి వేడుకల లోపు స్థలం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఎస్సీ కులస్తులు కుల సంఘ సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందిగా మారిందని అన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి స్థానిక తహసీల్దార్‌ను కలవాలని సూచించగా ఆయనను కలిసి విషయాన్ని వివరించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, దుర్గం ప్రతాప్, మాలి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగోసే శంకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు జిల్లా విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్థానిక సెయింట్ మేరీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మసడే శివకృష్ణ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థిని జిల్లా విద్యాధికారి అశోక్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి జిల్లా విద్యార్థి ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సాంబశివరావు జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 29 వరకు మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో జరగనున్న పోటీల్లో శివకృష్ణ పాల్గొంటారని తెలిపారు. క్రికెట్‌లో మరిన్ని మెలుకువలు విద్యార్థికి నేర్పి జాతీయ స్థాయికి ఎంపికయ్యేలా కృషి చేస్తామన్నారు. విద్యార్థి తండ్రి సంతోష్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయికి తన కుమారుడు ఎంపిక కావడం సంతోషంగా ఉందని అన్నారు. జాతీయస్థాయి జట్టులో చోటు సంపాదించే విధంగా చిన్నప్పటినుండే క్రికెట్ పై విద్యార్థికి మక్కువ పెంచామన్నారు. విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడానికి చేయూత నందించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థిని అభినందించిన వారిలో పీజీ హెడ్ మాస్టర్లు శ్రీనివాస్, పూర్ణచందర్, పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ ఝాన్సీ, ప్రిన్సిపాల్ మేరీ, పీఈటీ కడతల రాకేష్, బొమ్మకంటి కిరణ్, అర్చన కుమారి ఉన్నారు.

గంగ స్నానానికి బయలుదేరిన భీమన్న దేవుళ్లు

నవతెలంగాణ-పెంబి

మండలంలోని ఇటిక్యాల్ మందపల్లి పెద్దమ్మ తల్లి గజాలు, ఇటిక్యాల్ భీమన్న దేవుని గజాలు శుక్రవారం గంగ స్నానానికి బయలుదేరాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడు రోజులుగా అన్ని గ్రామాల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిస్తూ ఈరోజు ముగించుకొని గంగస్నానాకి బయలుదేరాయని తెలిపారు. ఈరోజు గంగకు చేరుకొని శనివారం ఉదయం గంగ స్నానం చేసుకొని తిరుగు ప్రయాణం వచ్చి ఆదివారం గుడికి చేరుకొని, అదే రోజు రాత్రి దేవుళ్ల కళ్యాణం జరిపిస్తారు. దీంతో జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పూజారి లింగన్న తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
శనివారం | ఫిబ్రవరి 24, 2024 | www.navatelangana.com

మురికి కాలువ నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-జైపూర్



మండల పరధి ఇందారం గ్రామ పంచాయతి 11వ వార్డులో స్థానిక ఎంపీటీసీ అర్కె స్వర్ణ సంతోష్ యాదవ్ శుక్రవారం మురికి కాలువ నిర్మాణ పనులు ప్రారంభించారు. 11వ వార్డు ఎస్టీ కాలనీ వాసుల సౌకర్యార్థం ఎంపీ ల్యాడ్స్ రూ.5 లక్షల మురికి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరికి కృషి చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ స్వర్ణ సంతోష్ యాదవ్‌తో పాటు స్థానికులు చేద మహేందర్, మూట లక్ష్మణ్, పూజరి గంగన్న, మీనుగు దుర్గేష్ పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్ జోన్‌లో ఆంక్షలపై సంతకాల సేకరణ

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ అభయారణ్యంలో వాహనాల రాకపోకలపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ మండల కేంద్రంలో నాయకులు సంతకాల సేకరణ ప్రారంభించారు. శుక్రవారం కేంద్రంలో రహదారులపై అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని ఉద్యమ నాయకులు ప్రజల సంతకాలను సేకరించారు. అటవీ ఆంక్షలతో భారీ వాహనాలు రాలేకపోతున్నాయని, దీంతో రవాణా వ్యవస్తకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. దీంతో మండల అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. చిరు వ్యాపారులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు, కొండపల్లి మహేష్ పాల్గొన్నారు.

పబ్లిక్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 1వ తరగతిలో ప్రవేశానికి షెడ్యూల్డ్ కులముల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జిల్లాకు 2 సీట్లు కేటాయించడం జరిగిందని, అభ్యర్థులు జిల్లా వాసులై ఉండి జూన్ 1, 2017 నుంచి మే 31, 2018 మధ్య జన్మించి ఉండాలని, సంబంధిత శాఖ ద్వారా జారీ చేయబడిన జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని, అభ్యర్థి పేరిట జారీ చేయబడిన కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని, గ్రామీణ ప్రాంతాల వారు రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారు రూ.2 లక్షల వార్షిక ఆదాయం కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తదితర ధ్రువపత్రాలతో మార్చి 12వ తేదీ సాయంత్రం 3 గంటలలోగా తమ దరఖాస్తులను సమర్పించాలని, మార్చి 15వ తేదీన లాటరీ పద్ధతిన అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9441874738 నెంబర్ లేదా జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చని, అర్హత, ఆసక్తి కల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-జైపూర్

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వనజారెడ్డిని శుక్రవారం బీఆర్ఎస్ ఎంపీటీసీలు, తాజా మాజీ సర్పంచులు కలిశారు. తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించి వేమనపల్లికి బదిలీపై వెళ్లిన రమేష్ స్థానంలో ఆమె రావటంతో స్థానిక నాయకులు వనజారెడ్డిని శాలువాతో సన్మానించారు. అదేవిధంగా జైపూర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలమూరి అరవింద రావు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గుండు తిరుపతి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పెద్దపల్లి రమేష్, ఎంపీటీసీ సభ్యులు అర్కె స్వర్ణ సంతోష్ యాదవ్, బోయిని స్వాతి సంపత్, వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు ఆవిడపు గణేష్, సారయ్య, రాజకుమార్, మేడి రవి, సమ్మయ్య పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రకు బీజేపీ నాయకులు

నవతెలంగాణ-లక్షెటిపేట

మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి పిలుపు మేరకు మంచిర్యాలకు చేరుకొనున్న విజయ సంకల్ప యాత్రకు స్వాగతం పలకడానికి లక్షెట్టిపెట నుండి బీజేపీ నాయకులు, యువకులు బైక్ ర్యాలీగా బయలు దేరారు. ఈ యాత్రకు ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరు కానున్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ 2014 నుంచి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో సాధించిన విజయాలు, ప్రపంచంలో భారత దేశం విశ్వగురుగా మారిందని తెలిపారు. దేశంలో ఉన్న విచ్ఛిన్నకర శక్తులను, తీవ్రవాదాన్ని లేకుండా చేసింది బీజేపీ మోడీ నాయకత్వమే అని తెలిపారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మరొక్క సారి బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రజలు బీజేపీకి వేసే ఒక్క ఓటుతో దేశంలో ఎన్నో మార్పులు తీసుకు రావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు విరమల్ల హరి గోపాల్ రావు, జిల్లా కోశాధికారి గుండా ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వేముల మధు, సీనియర్ నాయకులు నరేష్ చంద్ జైన్, నాయకులు గడమళ్ళ చంద్రయ్య, నల్ల ఆనంద్, కొమకుల రవి, పాంచాల రమేష్, రాజమౌళి, విహార్ పాల్గొన్నారు.

పాఠశాలలో జడ్పీ మాక్ సమావేశం



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులచే మాక్ జడ్పీ సర్వసభ్య సమావేవం నిర్వహించారు. విద్యార్థులు జడ్పీ చైర్మన్, సీఈఓ, కలెక్టర్, ఎమ్మెల్యే, మంత్రి, వివిధ శాఖల అధికారులు, అధికార, ప్రతిపక్ష సభ్యుల పాత్రలను పోషించి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ప్రస్తుతం జిల్లాలో పలుచోట్ల జరుగుతున్న సమ్మక్క సారక్క జాతరల్లో మంచినీటి, మరుగుదొడ్ల, పారిశుధ్య, ఆరోగ్య రవాణాకు తీసుకున్న చర్యలపై సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కొండు జనార్ధన్, సత్యనారాయణ, ఓంప్రకాశ్, చందూలాల్, స్వరూప రాణి, యాకూబ్, సదానందం, వాణిప్రియ, వీణ, యూసఫ్ మొదలగు వారు పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయకుమార్ విద్యార్థులు సమావేశాన్ని చక్కగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు.

ఘనంగా సమ్మక్క సారలమ్మ జాతర

నవతెలంగాణ-కౌటాల

మండల కేంద్రంలోని పల్లె ప్రకతి వనం సమీపంలో సమ్మక్క సారలమ్మ జాతర శుక్రవారం భక్తి శ్రద్ధలతో ప్రారంభించి, గద్దెల వద్దకు కంకలమ్మ గుట్టపై నుంచి కంక చెట్లను పూజించి డప్పు వాయిద్యాలతో శివ సత్తుల విన్యాసాలతో గద్దెల వద్దకు తీసుకుని వచ్చి సమ్మక్క సారలమ్మలను ప్రతిష్ఠించుకొని జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నిర్వహకులు డబ్బా గోపాల్ అధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

రైస్‌మిల్ ఏర్పాటుకు అనుమతులివ్వొద్దు

- అదనపు కలెక్టర్‌కు కాంగ్రెస్ నాయకుల వినతి



నవతెలంగాణ-జైపూర్

రామారావుపేట్ శివారు సర్వే నెంబర్ 210, 218, 219లలో సుముఖ ఇండస్ట్రీస్ పేరుతో నెలకొల్పుతున్న రైస్‌మిల్‌కు ప్రభుత్వ పరంగా అనుమతులు ఇవ్వకూడదని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు అదనపు కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. సుముఖ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ రైస్‌మిల్ పేరుతో తాటిపల్లి శోభారాణి పేరుతో తాటిపల్లి శ్రీనివాస్ రైస్‌మిల్ ఏర్పాటు చేసేందుకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రేషన్ డీలర్‌గా రెవెన్యూ అధికారులతో పరిచయాలు పెంచుకున్న శ్రీనివాస్ గతంలో అనేక అవకతవకలకు పాల్పడ్డాడని వివరిస్తూ పిర్యాదులో పేర్కొన్నారు. ఇసుక మాఫీయా, భూమాఫీయా అంటూ అనేక కేసులు ఉన్నాయని, శ్రీనివాస్ నర్సింగాపూర్ శివారు నవాబు కుంటలో అక్రమంగా భూముల పట్టా చేసుకుని నష్టపరిహారం పొందినట్లు వారు ఆరోపించారు. అంతే కాకుండా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్, సుందిళ్ల ప్రాజెక్టులో నష్టపోయిన భూములకు పట్టాదారుగా పరిహారం పొందిన ఆయన బినామీ పేర్లతో లబ్ధిపొందినట్లు తెలిపారు. ఇలాంటి నేర చరిత్ర కలిగిన వ్యక్తికి ఇండస్ట్రీస్ ఏర్పాటుకు అనుమతులు నిరాకరించాలని కోరారు. అదేవిధంగా ఆయన పేరున గల రేషన్ డీలర్ షిప్‌ను రద్దు చేస్తూ శాఖ పరంగా ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ ఫయాజోద్దీన్, జిల్లా నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, విశ్వంబర్‌రెడ్డి, గుడెల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి



జన్నారంలో..

నవతెలంగాణ-జన్నారం

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి అన్నారు. శుక్రవారం వారు నిర్వహిస్తున్న మాదిగ జోడోయాత్ర కార్యక్రమంలో భాగంగా జన్నారం మండల కేంద్రానికి చేరుకున్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కులంలో ఉన్న మాదిగలు ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందాలంటే రిజర్వేషన్ ఒకటే మార్గం అన్నారు. మాదిగ కులస్తులంత ఐక్యంగా ఉండి పోరాటం చేస్తేనే రిజర్వేషన్ సాధించుకోవచ్చు అన్నారు. ఈ మాదిగ జోడోయాత్ర, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. మాదిగలంతా ఈ జోడోయాత్రకు సంఘీభావం తెలిపి ఈ యాత్రను ముందుకు సాగించడానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ మండల అధ్యక్షులు గంగారెడ్డి పాల్గొన్నారు.

లక్షెటిపేట : మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని మాదిగ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మాదిగ జోడో యాత్రలో బాగంగా శుక్రవారం లక్షెట్టిపేటకు ఆయన వచ్చిన సందర్భంగా మాట్లాడారు. మాదిగ జోడో యాత్రలో భాగంగా రాష్ట్రమంతా పర్యటిస్తున్నానని పేర్కొన్నారు. రాజకీయాలలో కూడా సముచిత స్థానం కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ మండల నాయకులు దర్శనాల నవీన్ కుమార్, చేతరాజు ఈశ్వర్, దర్శనలా రవితేజ, ఆరెల్లి ప్రవీణ్, కమాటం లారెన్స్, గోరువాంతుల ప్రశాంత్, పున్ని, సోను, సిద్ధూ, జీవన్ పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో..

రేపటి నుంచి అతిరుద్ర మహా యాగం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలో ఆదివారం సాయంత్ర 5 గంటల నుంచి జరిగే శోభాయాత్రతో ప్రారంభమై సోమవారం ఉదయం అతిరుద్ర మహా యాగము ప్రారంభం అవుతుందని పట్టణ పురోహితులు కొత్తపల్లి లక్ష్మీ భరద్వాజ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన యాగానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ మహా యాగము సోమవారం ఉదయం నుండి శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు సాగుతుందని తెలిపారు. ఐదు రోజులపాటు రుద్ర అభిషేకము, రుద్ర హవనములు, శత చండి పారాయణం యాగం వంటి ఈ మహా కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడడంతోపాటు లోక కళ్యాణార్థం లక్షెట్టిపేట పట్టణంలో అతి రుద్ర మహా యాగము చేపట్టడయి భగవదనుగ్రహం అన్నారు. అందరూ కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి శృంగేరి శారద పీఠాధిశ్వరులు జగద్గురు శంకరాచార్య, పుష్పగిరి పీఠాధిపతులు, హంపి విరూపాక్ష పీఠాధిపతులు, తదితరులు అతిరథ మహారధులు పాల్గొనే ఈ యాగంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చికిలి అగస్త్య శాస్త్రీ ఘనపాటి, చికిలి వశిష్ట నారాయణ శాస్త్రి ఘనపాటి, లక్షెటిపేట వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, గడ్డం వికాస్ పాల్గొన్నారు.

వన దేవతలను దర్శించుకున్న భక్తులు

నవతెలంగాణ-నస్పూర్



ముక్కిడి పోచమ్మ గుడి వద్ద గల సమ్మక్క సారలమ్మను భక్తులు శుక్రవారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం సారాలమ్మ, గురువారం సమ్మక్క గద్దెకు చేరుకోవడంతో భక్తుల రద్దీ పెరిగింది. భక్తులకు సింగరేణి ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు.

కమిటీ సభ్యులను అభినందించిన అధికారులు

ముక్కిడి పోచమ్మ వద్ద గల సమ్మక్క సారలమ్మ ఆలయ జాతర కమిటీ సభ్యులను, సివిల్ విభాగ ఉద్యోగులను, సెక్యూరిటీ సిబ్బందిని, ఏరియా వర్క్ షాపు సిబ్బందిని, ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ కె రఘు కుమార్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు అభినందించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వరుస క్రమంలో పంపించడము వారికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చూసుకోవడం చాలా అభినందించదగిన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, సీనియర్ పీఓ పి కాంతారావు, ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందేలా కృషి చేయాలి

నవతెలంగాణ-జన్నారం

ప్రజలకు మంచి సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని బీసీ సంఘం మండల నాయకులు అన్నారు. నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన శశికళను శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మండలాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ప్రజల సహకారం అవసరమని ఎంపీడీఓ శశికళ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు నర్సింలు, కోడూరి చంద్రయ్య, కదార్ల నరసయ్య ఆడెపు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

25న సీనియర్ పురుషుల కబడ్డీ ఎంపిక పోటీలు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25వ తేదీ శ్రీరాంపూర్ కాలనీ ప్రగతి స్టేడియంలో సీనియర్ పురుషుల జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీ రాజేంద్రప్రాణి, కార్యదర్శి రాంచందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలలో ఎంపికైన వారు మార్చి రెండవ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ సీనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మంచిర్యాల జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు బరువు 85 కేజీల లోపు ఉండి రూ.100తో పీఈటీ సదానందంకు రిపోర్ట్ చేయాలని కోరారు. ఏదైనా సమాచారం కోసం 9849124856 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఎంపిక





నవతెలంగాణ-నస్పూర్

సాధన ఎక్సెలెన్సియ పాఠశాల మైదానంలో ఫిబ్రవరి 22వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలలో సీతారాంపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 25వ తేదీన హైదరాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థులు కే రాము, సీహెచ్ రుచిత 400 మీటర్ల పరుపు పందెంలో ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, పీఈటీ మారయ్య తెలిపారు. వీరిని నస్పూర్ మున్సిపాలిటీ చైర్మన్ వేణు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్నధర్మారం గ్రామాన్ని సందర్శించిన సింగరేణి అధికారులు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని చిన్న ధర్మారంలో సింగరేణి అధికారులు పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఇటీవల మండల సమస్యల విషయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాసిపేట తహసీల్దార్ భోజన్న, కాంగ్రెస్ కాసిపేట మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ జీఎంను కలిసి పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం సింగరేణి అధికారులు ఏజెంట్, పర్సనల్ డిపార్ట్మెంట్, కాసిపేట గని మేనేజర్, సివిల్ డిపార్ట్మెంట్ అధికారులు చిన్న ధర్మారం గ్రామ పంచాయతీని సందర్శించారు. నీటి సమస్య, సీసీ రోడ్లు, డ్రైనేజీకి సంబంధించిన సమస్యలను తహసీల్దార్, మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్ స్థానిక ప్రజలు అధికారులకు వివరించారు. వాళ్ళు వెంటనే దీనిని సర్వే డిపార్ట్మెంట్ ద్వారా పరిశీలించి వీలైనంత త్వరగా ఈ పనులన్నీ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూర్తుజా, మైదాం రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, షారుక్, శ్రవణ్, సురేష్, పాల్గొన్నారు.

ఆలయంలో ఘనంగా కుంకుమార్చన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు గ్రామంలోని శ్రీ నారా నారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం మహిళలు ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. ఈ కుంకుమ పూజలను, వేద పండితులు, పూజారులు కాకర నరసయ్య మౌన స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. నేటితో ప్రారంభమైన నర నారాయణస్వామి జాతర మహోత్సవం ఈ నెల 25న రథోత్సవం, సోమవారం అగ్ని మల్లన్న ఆలయం దగ్గర, హోమగుండాలు బోనాల కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశీ రావు తెలిపారు. ఈ నర నారాయణస్వామి జాతరకు, నిర్మల్, ఆదిలాబాద్, జగిత్యాల్, మంచిర్యాల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తారని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయంలో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట మున్సిపాలిటీ ఇటిక్యాలలోని సమ్మక్క, సారలమ్మ వనదేవతల జాతర సందర్భంగా మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెట్టెం తిరుపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-ఉట్నూర్



సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమైన విషయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లాస్యనందిత చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ యువ ఎమ్మెల్యే లాస్యనందిత అకాల మరణం చెందడం కంటోన్మెంట్ నియోజకవర్గానికి తీరనిలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-తాంసి



మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని బోరపల్లి గ్రామంలో జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని శుక్రవారం మండల కేంద్రంలోని మాలి యువజన సంఘం ఆధ్వర్యంలో బీసీ సంఘం సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాలీ సంఘం నాయకులు గంగారాం మాట్లాడుతూ జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలను కక్ష పూరితంగానే ధ్వంసం చేయడం జరిగిందన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు మాజీ సర్పంచ్ కృష్ణ, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్, రాములు, గంగారాం ఉన్నారు.

డీఎస్పీని కలిసిన పలువురు నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నూతన డీఎస్పీ జీవన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి పూల బోకే అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై డీఎస్పీతో చర్చించారు. కలిసిన వారిలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయి చరణ్‌గౌడ్, ఎస్టీ సెల్ చైర్మన్ ఆనంద్‌రావు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, ఎస్సీ సెల్ చైర్మన్ చంద్రాల రాహుల్, మావల మండలాధ్యక్షుడు శేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్ రెడ్డి, రంజిత్‌రెడ్డి ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శులు

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకు నూతనంగా బదిలీపై వచ్చిన డీపీఓ శ్రీలతను జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆమె నివాసంలో సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. అనంతరం ఓపీఎస్‌ల సమస్యలు, కార్యదర్శిల సమస్యలపై విన్నవించగా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కె.చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షులు నర్సయ్య, నాయకులు రంజిత్, లక్ష్మీ ప్రియ, మోతీరాం, సంజన పాల్గొన్నారు.

అల్లూరి సంజీవరెడ్డి, పలువురు

ఆదిలాబాద్ డీఎస్పీగా జీవన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయనను పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అల్లూరి సంజీవరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ అంబకంటి అశోక్, జైనథ్ మాజీ ఎంపీపీ అల్లూరి కల్పప్‌రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీపీ సంజయ్ దుబే, మాజీ కౌన్సిలర్ అశోక్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ప్రవీణ్, అమృత్, శ్రీనివాస్, గంగారెడ్డి ఉన్నారు.

25న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన తెలంగాణ రచయితల వేదిక 8వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఉదారి నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రాష్ట్ర మహాసభలు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈనెల 25న ఉదయం 10.30గంటలకు ప్రారంభమవుతాయనికి తెలిపారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి కవి డాక్టర్ అందెశ్రీ, ఆంధ్రజ్యోతి సంపాదకులు కే శ్రీనివాస్, జుకంటి జగన్నాథం, తిరుమల రావులు పాల్గొంటున్నారని తెలిపారు. కాగా ఈ సభలు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కొండమల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా జిల్లా అధ్యక్షురాలికి సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన బీసీ మహిళల సమస్యలను వివరించినట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కాముని సుదర్శన్ నేత అన్నారు. అనంతరం బీసీ సంక్షేమ శాఖ తెలంగాణ రాష్ట్ర మంత్రి జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు మంజులను తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బీసీల, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బీసీ సంఘం నాయకులకు అభినందనలు తెలుపుతున్నానని తెలిపారు. బీసీ సంఘం నాయకులకు ఎల్లవేళల తాను అండగా ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా బీసీ నాయకులు అరవింద్, మహేష్, కామారెడ్డి పట్టణం 38వ వార్డు, బిసి మహిళా సంఘం ఇన్చార్జి వాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపట్టాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ఉపాధి హామీ పనులను ముమ్మరంగా చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి సంతోష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి పని కల్పించాలని, పనులలో నిర్లక్ష్యం చేయవద్దని, పనుల వద్ద అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఈ పరిశీలనలో ఏపీఓ రజిత, కార్యదర్శి లక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

నేడు ఎన్ఎస్ఎఫ్ ఫ్యాక్టరీకి కమిటీ సభ్యుల రాక

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని ప్రఖ్యాత నిజాంషుగర్ ఫ్యాక్టరీ పరిశీలనకు ప్రభుత్వం నియమించిన నిజాంషుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ సభ్యులు ఫ్యాక్టరీ పరిశీలనకు వస్తున్నట్లు మజ్దూర్ సభ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఉపేందర్ శుక్రవారం తెలిపారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమించిన కమిటీ సభ్యులు హాజరవుతున్న సందర్భంగా వారికి కార్మికుల సమస్యల సైతం వివరిస్తామని ఆయన పేర్కొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్



ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంలో అర్హులైన కులవృత్తుల వారందరు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బాలాజీ ఇన్ హాల్‌లో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం పై జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కులవృత్తులు చేసుకునే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ పథకం కింద 5 శాతం వడ్డీకి రుణం పొందవచ్చని, సబ్సిడీ సైతం ఉంటుందని తెలిపారు. వివిధ కుల వృత్తులు చేసుకునే వారికి శిక్షణ, మార్కెటింగ్‌తో పాటు, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. ఇదివరకే కులవృత్తి చేసుకునేవారు వారి వృత్తిలో నిరంతరం కొనసాగడమే కాకుండా వారి నైపుణ్యాలను ఇంకా పెంపొందించుకోవచ్చని అన్నారు. ఈ పథకంలో 18 రకాల చేతివృత్తుల వారు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. కుటుంబంలో ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. లబ్ధిదారులు మీసేవ కేంద్రాలు, గ్రామ, వార్డు పంచాయతీల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుకు ఎటువంటి రుసుము ఉండదని, పథకంలో మొదటి విడతగా లక్ష రూపాయల రుణం మంజూరు చేయబడుతుందని వివరించారు. ఋణ మొత్తాన్ని18 నెలల్లోగా చెల్లించాలని, రెండో విడతలో రూ.2లక్షల వరకు రుణం మంజూరు చేయబడుతుందని, ఈ మొత్తాన్ని 30 నెలల్లో చెల్లించాలని తెలిపారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులకు ప్రాథమిక శిక్షణలో భాగంగా గుర్తించబడిన నైపుణ్య కేంద్రాలలో వారం రోజులు శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ శిక్షణలో లబ్ధిదారులకు రోజుకు 500 చొప్పున వేతనం అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ డీఎఫ్ఓ నవీన్ కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ నర్సింహరెడ్డి, ఎల్‌డీఎం చంద్రశేఖర్, మెప్మా పీడీ సుభాష్, అధికారులు, వివిధ రకాల చేతివృత్తుల వారు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో నిర్వహించిన పిఎం విశ్వ కర్మ యోజన పథకంపై పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పిఎం విశ్వకర్మ యోజన పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ పథకం ముఖ్యంగా కులవృత్తి చేసుకునే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పథకం కింద కేవలం 5శాతం తక్కువ వడ్డీకి రుణం పొందవచ్చని, సబ్సిడీ సైతం ఉంటుందని తెలిపారు. వివిధ వృత్తులు చేసుకునే వారికి శిక్షణ ఇవ్వడం, మార్కెటింగ్‌తో పాటు, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. పిఎం విశ్వ కర్మ యోజన పథకం కింద వడ్రంగులు, కమ్మరులు, గంపలు, చాపలు, చీపురులు వంటి వివిధ పరికరాల తయారీదారులు, బంగారం పని చేసే వారు, కుమ్మరులు, శిల్పులు, చర్మకారులు, పాదరక్షల తయారీదారులు, తాపీ పనివారు, క్షురకులు, రజకులు, దర్జీలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, రేషన్ కార్డు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సీఎస్సీ సెంటర్స్, గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. మొదటి విడతలో లక్ష రూపాయల రుణం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత సమయంలో చెల్లించిన వారికి తిరిగి 2లక్షల రుణం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓలు గ్రామాల్లో విస్తృత అవగహన కల్పించాలన్నారు. నిరుద్యోగ యువత ఈ పథకాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, జిల్లా పంచాయతీ అధికారిణి శ్రీలత, ఎల్‌డిఎం భాస్కర్, ఎమ్ఎస్ఎంఈ డైరెక్టర్ రాజేష్ కుమార్, మెప్మా డీఎంసీ శ్రీనివాస్, సీఎస్సీ మేనేజర్ రాహుల్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



మండల కేంద్రంలోని మానవ హక్కుల వేదిక కార్యాలయంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలతో పాటు విశ్వవిద్యాలయం, ఉన్నత విద్యాసంస్థలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలని చర్చించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ ఆశావాహురాలు సుగుణక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి పాత జిల్లాలన్నిటికీ ఒక్కొక్క యూనివర్సిటీ ఉందని అన్నారు. కానీ ఆదిలాబాద్ జిల్లా గిరిజన ఆదివాసులు ఎక్కువగా ఉండే ప్రాంతమైనటువంటి జిల్లాకు ఉన్నత చదువులు చదువుకోడానికి ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలు లేక విద్యకు దూరమవుతున్నారు. తెలంగాణ నూతన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపేట వేస్తూ, త్వరలో మంచి విద్యాసంస్థలను ఏర్పాటుకు మా వంతుగా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని అన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు టీవీవీ జిల్లా అధ్యక్షులు రాహుల్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షులు రాహుల్, జిల్లా అధ్యక్షులు దాదిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణ్, నాయకులు మమత, సభ్యులు అనుసయా, విద్యార్థి సంఘం నాయకులు చందన్‌షా, మహేందర్, హన్మంత్‌రావు, మధుకర్, నాందేవ్, నాగోరావ్, అశోక్, ఆనంద్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్ అన్నారు. శుక్రవారం ఇంటర్మీడియెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్న ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ పరీక్షల నిర్వహణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విధులు కేటాయించిన అధికారులు వెంటనే ఆయా పరీక్షా కేంద్రాలను సందర్శించి, ఫర్నీచర్, విద్యుత్, మంచినీరు, వెలుతురు వంటి మౌలిక సదుపాయాలును పరిశీలించి, ఏమైనా లోటుపాట్లు ఉంటె తెలిపితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవడంతో పాటు పరీక్షా కేంద్రాలవద్ద ప్రథమ చికిత్స ఏర్పాట్లు చేయాలని అన్నారు.

21,527 మంది విద్యార్థులు 30 పరీక్ష కేంద్రాలు...

జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 21,527 మంది పరీక్ష రాయనున్నారని, ఇందుకోసం 30 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఎటువంటి మాల్‌ప్రాక్టీస్, దుర్వినియోగాలకు అవకాశం ఇవ్వకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలన్నారు. అధికారులకు ఇచ్చిన బుక్‌లెట్‌లోని మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ, విద్యార్థులకు ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాలు అందించి, వాటిపై విద్యార్థులు హాల్ టికెట్ సరిగ్గా వేసేలా ఇన్విజిలేటర్ సంతకం చేసేలా చూడాలన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా చూడాలని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల తరువాత పరీక్షా కేంద్రానికి అనుమతించవద్దని స్పష్టం చేశారు. స్మార్ట్ ఫోన్లు, మొబైల్స్, స్మార్ట్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ పరీక్షా కేంద్రాలలో అనుమతించబడవని అన్నారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయన్నారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలనీ, పరీక్ష ప్రశ్నపత్రాలు ఓపెనింగ్, జవాబు పత్రాలు ప్యాకింగ్, మొబైల్ ఫోన్ యాప్ అన్ని సీసీ కెమెరా ఆధ్వర్యంలో నిర్వహించాలని తెలియజేశారు. సెల్ ఫోన్లు పరీక్ష కేంద్రాలకు అనుమతి లేదని, ప్రతి కేంద్రంలో ఏఎన్ఎం మెడికల్ కిట్స్ తో అందుబాటులో ఉండాలని, సరిపడా ఇన్విజిలేటర్‌లను నియమించుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి పరీక్షల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ పనులు ప్రారంభం



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని జామిని గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చటం కింద రూ.8లక్షల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి భూమిపూజ చేసి సీసీరోడ్డు, డ్రైనేజీల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇందుకోసం దాదాపు రూ.5కోట్లకు పైగా నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంచి ప్రజా పాలన సాగిస్తుందన్నారు. గ్రామంలో ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, అల్లూరి భూమారెడ్డి, యాల్ల పోతారెడ్డి, బైన్‌వార్ గంగారెడ్డి, బదాల రాజారెడ్డి, ఎల్మ రామ్ రెడ్డి, మహజన్ కృష్ణ, సోనేరావు, గులాబ్, అవినాష్, సోము, విఠల్, నరేష్, విలాస్, అనిల్, స్వామి, ఇస్తారి, తానాజీ, మోహన్, షేక్ ఫరీద్ పాల్గొన్నారు.

మద్దతు ఇవ్వాలని.. మర్యాదపూర్వకంగా కలిసి..



నవతెలంగాణ-తలమడుగు

కాంగ్రెస్ పార్టీ నుంచి పార్లమెంటు టికెట్టు ఆశిస్తున్న ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్‌రావు మొకాశి శుక్రవారం తలమడుగు జెడ్పీటీసీ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోక గణేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్టు ఆశిస్తున్నట్టు తనకు మద్దతు తెలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శంషుద్దీన్, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్యాల కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కాక్డే ఎక్‌నాథ్ పటేల్, ప్రకాష్‌రావు, ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కుడ్మేత సంగీత్, ఆదివాసీ సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్, కేడీఆర్ సైన్యం అధ్యక్షులు కాత్లె బుచ్చన్న, చహకటి రమేష్, నైతం తుకారాం పాల్గొన్నారు.

కేజీబీవీని పరిశీలించిన సమగ్ర శిక్ష సోషల్ ఆడిట్ బృందం



నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను శుక్రవారం సమగ్ర శిక్ష సోషల్ ఆడిట్ బృందం సభ్యులు పరిశీలించారు. పాఠశాల స్థితిగతులు సేకరించి, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు, సమగ్ర శిక్ష అభియాన్ అమలు గురించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు, వసతులు తదితర వివరాలను కూడా సేకరించారు. జిల్లాలో ఎంపికైన పాఠశాలలను తనిఖీ చేసి సంబంధిత వివరాలను డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు నివేదికను పంపనున్నట్లు సెస్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ కె.చంద్రశేఖర్ తెలిపారు. పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను పాఠశాల ఉపాధ్యాయులు సోషల్ ఆడిట్ బృందం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్ సూపర్‌వైజర్ రేణుక, ఎస్ఓ సంధ్యారాణి పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘ సభ్యులకు శిక్షణ



నవతెలంగాణ-తలమడుగు

స్వయం సహాయక సంఘ సభ్యులకు శుక్రవారం మండలంలోని సుంకిడి రైతువేదికలో తలమడుగు, తాంసీ, భీంపూర్ మండలాల గ్రామ సంఘం సహాయకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ సభ్యులకు లక్షాధికారులుగా తయారు చేయుటకు శిక్షణ ఇవ్వడం జరిగిందని డీపీఎం నాన్‌ఫార్మ్ బిట్ల గంగన్న తెలిపారు. సంఘ సభ్యులకు ఇతర సంస్థల నుంచి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి సభ్యులకు సంవత్సరానికి కనీసం లక్ష రూపాయలు ఆదాయం వచ్చే విధంగా అవగాహనతో పాటు శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది శ్రీనివాస్, రాపెల్లి స్వామి, ప్రసాద్, రవీందర్, సీసీలు గ్రామ సంఘం సహాయకులు పాల్గొన్నారు.